### ❖ పంట చేతికొచ్చుడు కష్టమే..



నా పేరు సంబోదు మల్లేశ్. నాకు టేకుమట్లలో చెరువుకింద రెండెకరాలు ఉన్నది. చెరువులో నీరు లేక బోరు కింద యాసంగి సాగు చేస్తున్న. కానీ ఆ బోరులోనూ నీరు అడుగంటింది. అటున్న పైపులు ఇటు పెట్టి, ఇటున్న పైపులు అటుపెట్టి.. మార్చి మార్చి పైపులు తిప్పితే మూడు రోజులకోసారి పంట మొత్తం తడుస్తుంది. మరో నెలరోజులు నీళ్లు అందితేనే పంట చేతికొస్తది. ఇప్పుడే ఎండలు ముదిరినయ్.. నీళ్లు అందుతయే లేదోనన్న భయమేస్తున్నది. పొద్దంతా బోరు నడిచినా నీరు అందుతలేదు. నీరు లేక మాటిమాటికీ మోటర్ వేసుకుంట.. ఆపుకుంటా నీరు పెడుతున్న. పొద్దున నుంచి సాయంత్రం కరెంట్ పోయే దాకా పొలం కాడనే ఉంటున్న. మధ్యమధ్యలో కరెంట్ ట్రిప్పు అవుతుంది. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో కూడా అర్థం కావడం లేదు. ఇటు కరెంట్ సరిగా రాక.. అటు నీళ్లు లేక పంట చేతికొచ్చుడు కష్టంగనే ఉన్నది.

**- సంబోదు మల్లేశ్, టేకుమట్ల, రైతు, మంచిర్యాల జిల్లా**



బోరు నుంచి నీరు అందక టేకుమట్లలో ఎండిపోతున్న వరి

# వరికి చేతికొచ్చేనా..!

## సుందిళ్ల బ్యారేజ్‌లో నీరు లేక అడుగంటిన భూగర్భ జలాలు

- బోర్లకింద వేసిన వరికి అందని నీరు
- మరోవైపు కరెంట్ సరిగా సరఫరాకాక తప్పని తిప్పలు
- పొద్దంతా మోటర్ నడిచినా ఫలితం శూన్యం
- పొట్టదశలో పంట ఎండిపోతుందంటూ రైతుల ఆవేదన

*జైపూర్ సమీపంలోని సుందిళ్ల బ్యారేజ్ నీరు లేక వెలవెల బోతుండగా, భూగర్భ జలాలు అడుగంటి వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించింది. అటు బోర్లలో నీళ్లు లేక.. ఇటు కరెంట్ సరిగా సరఫరా కాక పొట్టదశలో ఉన్న వరి చేతికందకుండా పోయే దుస్థితి నెలకొన్నది.*

మంచిర్యాల, మార్చి 14 (నమస్తే తెలంగాణ ప్రతి నిధి) : గోదావరి నదిపై ఏర్పాటు చేసిన సుందిళ్ల బ్యారేజ్‌లో నీరు లేకపోవడంతో మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని వందలాది ఎకరాల పంటలు నష్టపోయే పరిస్థితి వచ్చింది. సుందిళ్ల బ్యారేజ్‌లో నీరుంటే జైపూర్ మండలం మొదలుకొని.. మంచిర్యాల జిల్లా కేంద్రం వరకూ గోదావరిలో బ్యాక్ వాటర్ స్టోర్ ఉండేది. ఎప్పుడు చూసినా గోదావరి నిండు కుండలా కనిపించేది. కానీ, మేడిగడ్డ పిల్లర్‌ను సాకుగా చూపించి జైపూర్ సమీపంలోని సుందిళ్ల బ్యారేజ్, చెన్నూర్ సమీపంలోని అన్నారం బ్యారేజ్‌లలో నీరు ఆపకుండా.. వచ్చిన వరదను వచ్చినట్లు కిందకు వదిలేశారు. దీంతో గోదావరి ఎడారిగా మారిపోయింది. ఈ దెబ్బతో జైపూర్ మండలంలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. చెరువులు ఎండిపోయాయి. దీంతో చెరువులు, బోర్లపై ఆధారపడి సాగు చేసిన వరి పంటకు పొట్టదశలో నీరు అందడం లేదు. పొద్దంతా బోరు నడిపించినా నీరందని దుస్థితి నెలకొంది.

#### అడుగంటిన భూగర్భ జలాలు

ఈ యాసంగిలో జైపూర్ మండలంలో దాదాపు 11 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. బోర్ల కిందే ఇవన్నీ సాగవుతున్నాయి. ప్రస్తుతం మండలంలో భూగర్భ జలాలు అడిగంటిపోవడంతో వందల ఎకరాల్లో వరి ఎండిపోయే దుస్థితి నెలకొంది. మూడేళ్ల క్రితం ఇదే సమయానికి (ఫిబ్రవరి 2023)లో జైపూర్ మండలం కుందారం గ్రామంలో 15.89 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండే. గతేడాది, ఈ ఏడాది గోదావరిలో నీరు లేక నీటిమట్టం ఘోరంగా పడిపోయింది. గతేడాది 18.60 మీటర్లకు, ఈ ఏడాది 18.19 మీటర్ల లోతులో జలాలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. జైపూర్ మండల కేంద్రంతో పాటు గోదావరి పక్కనే ఉండే ఇందారం, టేకుమట్ల, రామారావుపేట, వేలాల గ్రామాల్లోనూ బోర్లలో నీరు పాతాళానికి పడిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో నెల రోజుల్లో చేతికి రావాల్సిన వరి నీరు లేక కండ్ల ముందే ఎండిపోతుందంటూ అన్నదాతలు వాపోతున్నారు. అధికారులు స్పందించి నీరందించాలని, లేనిపక్షంలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలంటూ డిమాండ్ చేస్తున్నారు.



మంచిర్యాలటౌన్ : రాస్తారోకో చేస్తున్న నాయకులను పక్కకు తప్పిస్తున్న పోలీసులు



లక్సెట్టిపేటలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



చెన్నూర్ : సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



బెల్లంపల్లి : సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బీఆర్ఎస్ నాయకులు



ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- రాస్తారోకోలు, ధర్నాలు
- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం

# సస్పెన్షన్‌పై ఫైర్

## సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై బీఆర్ఎస్ నిరసనలు

*మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెన్షన్ చేయడంపై బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శుక్రవారం మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో నిరసనలతో హోరెత్తించాయి. అసెంబ్లీ సాక్షిగా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేశాయి.*

మంచిర్యాలటౌన్, మార్చి 14: మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలో బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు కలగజేసుకుని బీఆర్ఎస్ నాయకులను పక్కకు తప్పించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదెసత్యం, రాష్ట్ర నాయకుడు గోగుల రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ పాలన చేతగాక సీఎం ప్రతిపక్ష నాయకులపై ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నాడని, స్ట్రెచర్, మార్చురీ అంటూ పిచ్చికూతలు కూస్తూ సీఎం పదవిని అపహాస్యం చేస్తున్నాడని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతగాక ప్రతిపక్ష నాయకులపై కక్షగట్టడం.. ప్రజలను పక్కదారి పట్టించడంలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఏడాదిలోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న ఏకైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని, ఎన్నికలకు ముందు అమలుకు సాధ్యంకాని హామీలను ఇచ్చారని, అవి నమ్మి ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే వాటిని అమలు చేయడం లేదని వారు విమర్శించారు. శాసనసభలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తారన్న కారణంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెన్షన్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు తోట తిరుపతి, వెంకటేశ్వర్ రావు, ఎర్రం తిరుపతి, మంతెన గట్టయ్య, కాటం రాజు, పడాల రవీందర్, కర్రు శంకర్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి, మార్చి 14 : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ చౌరస్తా వద్ద మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షాల గొంతునొక్కడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలపై మాత్రమే జగదీశ్‌రెడ్డి మాట్లాడారని పేర్కొన్నారు. ఆయనను అసెంబ్లీ సెషన్ నుంచి సస్పెన్షన్ చేయడం పిరికిపంద చర్య అన్నారు. బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సబ్బని అరుణ్ కుమార్, నాయకులు తాళ్లపల్లి మల్లయ్య, కాంపల్లి రాజం, ఆలీ, రాములు, ధర్మేందర్, సందీప్, చంద్రశేఖర్, గోగర్ల సత్యనారాయణ, రంగ మహేశ్, దాగం చరణ్, గుమ్మడి కృష్ణంరాజు, శ్రీనాథ్, దుర్గం రవి, సతీశ్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 14 : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సభ నియమాల ప్రకారం నడుచుకున్నారని, ఎవరిని దూషించలేదన్నారు. సస్పెన్షన్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఆసిఫాబాద్, రెబ్బెన, వాంకిడి సింగిల్ విండో చైర్మన్లు అలీ బిన్ అహ్మద్ సంజీవ్, పెంటు, మండల అధ్యక్షులు జాబొరె రవీందర్, శ్రీధర్, అజయ్ మాజీ సర్పంచులు, ఎంపీపీలు తదితరులు ఉన్నారు.

లక్షెట్టిపేట, మార్చి 14 : పట్టణంలోని ఉత్కూర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, మున్సిపాలిటీ మాజీ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్, డీసీఎంఎస్ తిప్పని లింగయ్య, అన్వర్‌ఖాన్, ఒరగంటి శ్రీకాంత్, షేక్ చాంద్ పాల్గొన్నారు.

చెన్నూర్, మార్చి 14 : పట్టణంలోని బస్టాండ్‌లో కాంగ్రెస్‌పార్టీ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహణం చేశారు. నిరసనల నేపథ్యంలో ప్రధాన కూడళ్లలో భారీగా పోలీసులను మోహరించారు. బీఆర్ఎస్ నాయకులు గ్రూపులుగా విడిపోయి, పోలీసుల నుంచి తప్పించుకొని బస్టాండ్‌లో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు రాజారమేశ్, మాజీ జడ్పీటీసీ మోతె తిరుపతి, మాజీ కౌన్సిలర్ రేవెల్లి మహేశ్, మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, కోటపల్లి సింగల్ విండో చైర్మన్ సాంబగౌడ్, నాయకులు విద్యాసాగర్, జడల మల్లేశ్, తిరుపతి సురేశ్, తగరం చిరంజీవి, రేవెల్లి సతీశ్, నయాబ్, తగరం అశోక్, రేణిగుంట శ్రీనివాస్, బోగె భారతి, మహేశ్ పాల్గొన్నారు.



మంచిర్యాల అర్బన్ : హోలీ వేడుకల్లో సీపీ అంబర్ కిశోర్ ఝా



ఆసిఫాబాద్‌లో నృత్యం చేస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు



ఆసిఫాబాద్‌లో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, పీవో ఖుష్బు గుప్తా



మంచిర్యాలలో కలెక్టర్ కుమార్ దీపక్

# కలర్‌ఫుల్ జోష్

- ఊరూరా అంబరాన్నంటిన హోలీ సంబురాలు
- రంగులు పూసుకొని సందడి చేసిన చిన్నారులు
- నృత్యాలతో యువతీ, యువకుల కేరింతలు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో కలర్‌ఫుల్ జోష్ కనిపించింది. శుక్రవారం ఉదయం నుంచి హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. చిన్నా పెద్దా తేడాలేకుండా వీధుల్లోకి వచ్చి రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. యువతీయువకులు కేరింతలు కొడుతూ నృత్యాలతో హోరెత్తించారు. కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు రంగులు పూసుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

# గ్రూప్-3 ఫలితాల్లో మనోళ్ల సత్తా

## రాష్ట్రస్థాయిలో 39వ ర్యాంక్ సాధించిన గుడిపేట వాసి లెక్కల శ్రావణ్

- మందమర్రికి చెందిన బొడ్డు తిరుపతికి 60వ ర్యాంకు
- గుడ్లబోరికి చెందిన భాస్కర్‌కు 154 ర్యాంక్



బొడ్డు తిరుపతి



లెక్కల శ్రావణ్



కామ్రే భాస్కర్

హాజీపూర్/మందమర్రి/రెబ్బెన, మార్చి 14 : శుక్రవారం వెలువడిన గ్రూప్-3 ఫలితాల్లో మంచిర్యాల జిల్లా వాసులు సత్తా చాటారు. హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన లెక్కల లింగయ్య-కళావతి దంపతుల కుమారుడు శ్రావణ్ రాష్ట్ర స్థాయిలో 39వ ర్యాంక్ సాధించాడు. మూడు రోజుల క్రితం వెలువడిన గ్రూపు 2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 97వ ర్యాంక్ తెచ్చుకున్నాడు. గ్రూప్-4లో స్టేట్ లెవల్‌లో 210వ ర్యాంక్, జిల్లాలో 11వ ర్యాంక్ సాధించి బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గతంలో పంచాయతీ కార్యదర్శి పోస్టుకు జిల్లా మొదటి ర్యాంక్ సాధించాడు. కొద్ది రోజులు ఉద్యోగం చేసి.. తర్వాత రాజీనామా చేశాడు. ప్రస్తుతం గ్రూప్-3 ఫలితాల్లో విజయం సాధించి ప్రశంసలు అందుకుంటున్నాడు.

#### మందమర్రికి చెందిన బొడ్డు తిరుపతికి 60వ ర్యాంక్

మందమర్రి పట్టణంలోని ప్రాణహిత కాలనీకి చెందిన బొడ్డు పోశక్క-భూమయ్య దంపతుల చిన్న కుమారుడైన తిరుపతి స్థానిక కార్మెల్ పాఠశాలలో పదో తరగతి వరకు చదివాడు. ఆపై బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో మైనింగ్ డిప్లొమా విద్యనభ్యసించాడు. 2016లో సింగరేణి సంస్థలో జేఎంఈటీ నోటిఫికేషన్ వెలువడగా, పరీక్ష రాసి ఉద్యోగం సాధించాడు. అనంతరం దూరవిద్య కాకతీయ యునివర్సిటీలో బీఏ పూర్తి చేశాడు. రాష్ట్ర ప్రభుత్వం వెలువరించిన గ్రూప్-4 పరీక్షలో ఉత్తీర్ణత సాధించి క్యాతనపల్లి మున్సిపాలిటీ జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం పొందాడు. ఇటీవల వెలువడిన గ్రూప్-2లో రాష్ట్రస్థాయిలో 77వ ర్యాంకును సాధించాడు. శుక్రవారం వెలువడిన గ్రూప్-3 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 60వ ర్యాంకు సాధించాడు. వరుస ఉద్యోగాలు సాధించిన తిరుపతిని కుటుంబ సభ్యులు, స్థానికులు అభినందించారు. గ్రూప్-1 సాధించడమే తన లక్ష్యమని, అందుకు సిద్ధమవుతున్నానని తిరుపతి తెలిపాడు.

#### గుడ్లబోరికి చెందిన భాస్కర్‌కు 154వ ర్యాంక్

రెబ్బెన, మార్చి 14 : కౌటల మండలం గుడ్లబోరి గ్రామానికి చెందిన భాస్కర్ 2016లో సింగరేణి సంస్థలో ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం బెల్లంపల్లి ఏరియాలోని ఏరియా స్టోర్స్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గోలేటిటౌన్‌షిప్‌లోని గ్రంథాలయంలో ప్రిపరేషన్ కొనసాగించి గ్రూప్-2 ఫలితాల్లో 229 ర్యాంక్ సాధించగా, తాజాగా గ్రూప్-3 ఫలితాల్లో 154 ర్యాంక్ సాధించి ప్రతిభ చాటుకున్నాడు.